క్లుప్తంగా

ఎమ్మెల్యే పెద్దారెడ్డిని గెలిపించండి



పథకాలను వివరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి

తాడిపత్రి: తాడిపత్రి ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డిని మరో మారు గెలిపించుకోవడం ద్వారా జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవచ్చని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి వార్డు ప్రజలను కోరారు. శుక్రవారం పట్టణంలోని 11వ వార్డులో ఆయన ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా శంకరనారాయణ, ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డిని గెలిపించాలన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికీ నవరత్న పథకాలను అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అందుకే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.

ప్రజా సంక్షేమమే సీఎం లక్ష్యం



మహిళలను ఓటు అడుగుతున్న సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రిరూరల్: ప్రజా సంక్షేమం ధ్యేయంగా పనిచేస్తున్న జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జయనగర్ కాలనీలో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నవరత్నాల కరపత్రాలను అందచేశారు. తాడిపత్రిలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి ఎమ్మెల్యే పెద్దారెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు.

తరిమెల కోనారెడ్డిని కలసిన శంకరనారాయణ



కోనారెడ్డితో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ

శింగనమల: మండలంలోని తరిమెల గ్రామానికి చెందిన ఏడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తరిమెల కోనారెడ్డిని శుక్రవారం అనంతపురం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శంకరనారాయణ కలిశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, ఎంపీగా తనను గెలిపించాలని కోరారు . వైఎస్సార్ సీపీ విజయనాకి కృషి చేస్తానని తరిమెల కోనారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అగ్రి బోర్డు చైర్మన్ రామచంద్రారెడ్డి, శివపురం పెద్ద తిరుపతయ్య, ఇరువెందల చితంబరిరెడ్డి, నారాయణస్వామి, హరీష్, ఆది, శీన తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి



ఓటు అభ్యర్థిస్తున్న సాయి అర్చితరెడ్డి

తాడిపత్రిరూరల్: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి కేతిరెడ్డి పెద్దారెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే పెద్దారెడ్డి కోడలు సాయి అర్చితరెడ్డి కోరారు. పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో శుక్రవారం ఎమ్మెల్యే పెద్దారెడ్డి తరఫున ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలన్నారు. తాడిపత్రిలో అభివృద్ధి ఎమ్మెల్యే పెద్దారెడ్డితోనే సాధ్యమన్నారు.

పూల చాందిని ఊరేగింపు



పూల చాందిని ఊరేగిస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: మండలంలోని పెద్దయక్కలూరు గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున హజరత్ హాజీవలి ఉరుసు మహోత్సంలో భాగంగా హిందూ, ముస్లింలు పూల చాందినిని గ్రామంలో ఘనంగా ఊరేగించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారికి చక్కెర, బెల్లం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ శరత్‌చంద్ర పర్యవేక్షించారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం

• ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు



కడవకల్లులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



జన సందోహం మధ్య ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు

పుట్లూరు: ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు కోరారు. శుక్రవారం ఆయన 'మన ఊరికి మన వీరా' కార్యక్రమంలో భాగంగా మండలంలోని కడవకల్లు, సంజీవపురం, ఓబుళాపురం, దోశలేడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆయా గ్రామాల్లో ప్రజలు పూలమాలలు వేస్తూ ఘన స్వాగతం పలికారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీ ఇంటి వద్దకు వలంటీర్ల వచ్చి పింఛన్ అందించాలన్నా, అర్హతే ప్రమాణికంగా అందించే సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా వైఎస్సార్‌సీపీకి మద్దతు అందించి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఎన్నికలకు ముందు మోసపూరిత హమీలిచ్చి, అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని విస్మరించడం చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య అని విమర్శించారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి ప్రజలను వేధింపులకు గురిచేసిన తీరును గుర్తు చేశారు. మరోమారు మోసపూరిత మాటలతో ప్రలోభాలకు గురి చేయడానికి చంద్రబాబు అండ్ కో వస్తున్నారని, వారి అబద్ధపు మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించడానికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎంపీపీ బి.రాఘవరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, నాయకులు మూలి వెంకటరామిరెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ రామసుబ్బారెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు, విశ్వనాథరెడ్డి, నాగముణి, రామకేశవ, రమేష్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, కంచెం శ్రీనివాసులరెడ్డి, రామాంజులరెడ్డి, మహేష్‌రెడ్డి, కంచెం శ్రీనివాసులరెడ్డి, ఆదినారాయణరెడ్డి, రమణాయాదవ్, కేశవ, సుధాకర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలలో మమేకమవుతున్న వీరా

ఎన్నికల ప్రచారంలో శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు ప్రజలలో మమేకమై ముందుకు సాగుతున్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రతి ఇంటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ జగనన్న అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలు సైతం వీరాంజనేయులు తమలో ఒకడిగా భావిస్తూ 'మా వీరా వచ్చాడంటూ' హారతులు పట్టి పూల వర్షం కురిపిస్తున్నారు. కడవకల్లులో ప్రజల కోరిక మేరకు టిప్పర్ ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు. సంక్షేమ ఫలాలు అందుకోవడానికి జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఆయన అభ్యర్థించారు.



వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, ఆలూరు సాంబశివారెడ్డి

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిక

పుట్లూరు: మండలంలోని ఓబుళాపురం గ్రామంలో శుక్రవారం ఐదు కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. సీఎం జగనన్న అర్హతే ప్రామాణికంగా పార్టీలకు, వర్గాలకు అతీతంగా చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవడానికి వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నట్లు తిరుపతయ్య, కృష్ణమోహన్, రామక్రిష్ణ, గణేష్, వెంకటరాముడు తెలిపారు. వీరికి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు, ప్రభుత్వ విద్య సలహాదారు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుంటేనే పథకాలు కొనసాగుతాయన్నారు.

నేడు వీరాంజనేయుల పర్యటన

నార్పల: ప్రచారంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు శనివారం పర్యటించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయనతో పాటు అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ హాజరవుతారన్నారు. మండలంలోని బొందలవాడ గ్రామంలో ఉదయం 7:30 గంటలకు ప్రచారం ప్రారంభమై రంగాపురం జంగంరెడ్డిపల్లి, గూగూడు, ముగేతిమ్మంపల్లి గ్రామాల్లో కొనసాగుతుందన్నారు. ప్రచారం అనంతరం రాత్రికి గూగూడు గ్రామంలో పల్లెనిద్ర చేస్తారన్నారు. ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

గార్లదిన్నె: మండల కేంద్రం శింగనమల క్రాస్ సమీపంలో బ్రిడ్జి వద్ద ఓ వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. శుక్రవారం ఎస్‌ఐ మాట్లాడుతూ శింగనమల మండలం నాగుల గుడ్డం తండాకు చెందిన పాండు నాయక్ అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తుంటే అరెస్ట్ చేశామన్నారు. అతడి నుంచి 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

శింగనమల: మండలంలోని ఆనందరావుపేటలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామంలో ఆంజనేయులు అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో అతన్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి నుంచి 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



రేగడి కొత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



చందనలో కవాతు నిర్వహిస్తున్న సీఐ నాగార్జున రెడ్డి , కేంద్ర బలగాలు

బుక్కరాయసముద్రం: ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని బీకేఎస్ సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని రేగడి కొత్తూరులో పారా మిలటరీ బలగాలతో ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నికల నమీపిస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనవసరంగా గొడవలు, అల్లర్లుకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. అక్రమంగా మద్యం, డబ్బులు సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

యాడికి: ఎన్నికల నేపథ్యంలో బందోబస్తుకు విచ్చేసిన పోలీసు బలగాలతో కలసి సీఐ నాగార్జునరెడ్డి కవాతు నిర్వహించారు. శుక్రవారం మండలంలోని తూట్రాళ్లపల్లె, రామరాజు పల్లె, కూర్మాజీపేట, రాయల చెరువు, చందన, లక్షుంపల్లె గ్రామాల్లోని రోడ్డు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఎన్నికల్లో ఎలాంటి గొడవలకు పాల్పడకూడదని, ప్రశాంత ఎన్నికలకు సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

26 మంది నామినేషన్ల ఆమోదం

తాడిపత్రి: 2024 సార్వత్రిక ఎన్నికల్లో తాడిపత్రి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసే ప్రధాన పార్టీలతో పాటు ఇతర పార్టీలకు చెందిన పలువురు అభ్యర్థులు వేసిన నామినేషన్లను ఆర్‌ఓ రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల సహాయక సిబ్బంది శుక్రవారం స్క్రూటినీ చేపట్టారు. 26 మంది దాఖలు చేసిన నామినేషన్లు ఆమోదం పొందగా, రెండు తిరస్కరణకు గురయ్యాయి. వాటి వివరాలను మీడియాకు ఆర్ ఓ శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 25 నామినేషన్లు గడువు ముగిసే నాటికి తాడిపత్రి నియోజకవర్గానికి ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసే వారి నుంచి 28 మంది నామినేషన్లు అందాయన్నారు. వాటిని స్క్రూటినీ చేయగా అందులో 26 మంది నామినేషన్లు అర్హత పొందాయన్నారు. ప్రధాన పార్టీల తరఫున అభ్యర్థులుగా దాఖలు చేసిన వారి నామినేషన్లలో భాగంగా ఎమ్మెల్యే సతీమణి కేతిరెడ్డి రమాదేవి వైఎస్సార్‌సీపీ తరఫున సమర్పించిన నామినేషన్లలో బీ ఫారం జత చేయలేదు. అలాగే తెలుగు దేశం పార్టీ తరఫున నామినేషన్ వేసిన మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సైతం బీ ఫారం జతచేయకపోవడంతో వారి నామినేషన్లను తిరస్కరించినట్లు ఆర్‌ఓ తెలిపారు. స్క్రూటినీ ప్రక్రియ అనంతరం మొత్తం 26 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయన్నారు.

16 నామినేషన్ల ఆమోదం

శింగనమల: శింగనమల నియోజకవర్గంలో దాఖలు చేసిన 30 మందిలో 16 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి వెన్నల శీను శుక్రవారం తెలిపారు.వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజనేయులు, టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణి, బీఎస్పీ–కుందన గౌతమి, కాంగ్రెస్–సాకే శైలజానాథ్, ఆల్ ఇండియా కిసాన్ జనతా పార్టీ–నాగరాజు, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ–రామాంజనేయులు , వెలుగు రాజాధికార సమితి పార్టీ –వెంకటసుబ్బన్న, జై మహాభారత్ పార్టీ –సాకే శ్రీదేవి, స్వతంత్ర అభ్యర్థులు మాధవ, ఆనంద్‌కుమార్, బాల నరసింహులు, ఓబిలేసు, రవిరాజ్, రామ్‌మోహన్,సాయి ప్రసాద్, నల్లప్ప నామినేషన్లు ఆమోదం పొందాయన్నారు.

ఇది కాదా అభివృద్ధి!



టీడీపీ హయాంలో కుమ్మనమల ప్రాథమికోన్నత పాఠశాలలో అసంపూర్తిగా నిర్మించడంతో నిరుపయోగంగా ఉన్న తరగతి గదులు



కుమ్మనమల ప్రాథమికోన్నత పాఠశాలను నాడు–నేడు కార్యక్రమం కింద అందంగా తీర్చిదిద్దిన దృశ్యం

శిథిలావస్థకు చేరిన తరగతి గదులు... కంపు కొట్టే మరుగుదొడ్లు... కనిపించని కుర్చీలు, ఫ్యాన్లు ... అపరిశుభ్రతకు నిలయాలుగా పరిసరాలు... చదువుకోవాలంటేనే విద్యార్థులు విరక్తి చెందేవిధంగా ఉండేవి ప్రభుత్వ పాఠశాలలు. అయితే ఇదంతా గతం. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కింద రూ.కోట్ల నిధులు ఖర్చు చేయడంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారిపోయాయి. విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు.

పుట్లూరు: మండలంలోని తక్కళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను నాడు–నేడు కింద మొదటి విడతలో రూ.16లక్షల వ్యయంతో తీర్చిదిద్దారు. ఆ పాఠశాలలో 2019 సంవత్సరానికి ముందు వరకూ కూలడానికి సిద్ధంగా ఉంటూ మరమ్మతు చేయాలని పలుమార్లు పత్రికల్లో వచ్చిన ఓ తరగతి గది ఇప్పుడు చూడచక్కగా మారింది. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సైతం పాఠశాలకు వచ్చిన సమయంలో ఆ తరగతి గదిని చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇది అప్పటి తరగతి గదేనా..! అని ఆశ్చర్యపోతున్నారు.

చూడ ముచ్చటగా కుమ్మనమల ప్రాథమికోన్నత పాఠశాల

అసంపూర్తిగా నిర్మాణమైన తరగతి గదులతో ఉన్న కుమ్మనమల ప్రాథమికోన్నత పాఠశాల ప్రస్తుతం ఆదర్శంగా నిలుస్తోంది. పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న ప్రభుత్వం నాడు–నేడు కింద చేసిన అభివృద్ధి పనులపై ఆ గ్రామ ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. తరగతి గదులు లేక చెట్ల కింద వరండాల్లో చదువుకునే తమ పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు తరగతి గదులను చక్కగా తీర్చిదిద్దారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామన్నారు.



టీడీపీ ప్రభుత్వ హయాంలో తక్కళ్లపల్లిలోని తరగతి దుస్థితి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అనంతరం తరగతి గది రూపురేఖలు మారిన దృశ్యం

లారీ ఢీకొని యువకుడి మృతి



సాయి చరణ్ (ఫైల్)

తాడిపత్రి: మండలంలోని చుక్కలూరు క్రాసింగ్ సమీపంలో ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో సాయి చరణ్ (20) అనే యువకుడు శుక్రవారం రాత్రి మృతి చెందాడు. వివరాలు.. చుక్కలూరుకు చెందిన సాయి చరణ్ ఆటోలో గ్రామానికి వెళ్తుండగా, చుక్కలూరు – సజ్జలదిన్నె క్రాసింగ్‌లో ఆటో చుక్కలూరు వైపు టర్నింగ్ తీసుకుంటున్న సమయంలో తాడిపత్రి నుంచి గుత్తికి వెళ్తున్న లారీ వేగంగా ఢీ కొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న సాయి చరణ్ ఎగిరి లారీ వెనుక చక్రాల కింద పడి మృతి చెందాడు. లారీ ఆటోను ఢీ కొనగానే లారీ డ్రైవర్ భయంతో వాహనాన్ని మరింత వేగంగా ముందుకు పోనిచ్చాడు. దీంతో లారీ వెనుక వైపు చక్రాల కింద పడిన సాయి చరణ్ మృతదేహం కొన్ని మీటర్లు ముందుకు వెళ్లాక రహదారిపై పడింది. వెంటనే స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించగా, వారు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. అనంతరం కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ప్రమాద స్థలంలో ఆటో రహదారి పక్కగా పడగా డ్రైవర్ కనిపించలేదు. దీంతో ఆటో డ్రైవర్ ఎవరన్నది తెలియలేదు. పోలీసులు ఆటో డ్రైవర్ వివరాల గురించి ఆరా తీస్తున్నారు. మృతుడికి తల్లి రమాదేవి ఉంది. తండ్రి మురళీ ఇంతకు ముందే మృతిచెందాడు.

ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా అవినాష్



తాడిపత్రి అర్బన్: పట్టణ ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా పెండేకంటి అవినాష్ ఎన్నికయ్యారు. ఈమేరకు ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు తలుపుల సురేంద్రనాథ్ నియామకపు పత్రాన్ని అందజేశారు. పట్టణంలోని వాసవీ కన్యాకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆర్యవైశ్య యువజన సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పెండేకంటి అవినాష్, ఉపాధ్యక్షులుగా వరుణ్‌కుమార్, లోకేష్, కార్యదర్శి గౌరీశంకర్, జాయింట్ సెక్రటరీలుగా యశ్వంత్‌కుమార్, సుకేష్, కోశాధికారిగా జె.సందీప్ ఎన్నికయ్యారు. అవినాష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతను కట్టబెట్టిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తలుపుల సురేంద్రనాథ్, ఆర్యవైశ్యసంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. యువజన సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

మూడు గడ్డివాముల దగ్ధం

పామిడి: మండలంలోని కత్రిమల గ్రామంలో శుక్రవారం మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో రైతులు వెంకట్రామిరెడ్డి, పుల్లన్న, ప్రతాప్‌రెడ్డికి చెందిన మూడు గడ్డివాములను కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు. గుంతకల్లు నుంచి ఫైర్ ఇంజన్ వచ్చేలోపే వాములు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి బాధిత రైతులకు పరామర్శించారు. ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

చెరకు తోట దగ్ధం

గుంతకల్లు రూరల్: అగ్ని ప్రమాదంలో ఎకరా చెరకు తోట పూర్తిగా కాలిపోయింది. వివరాలు.. గుంతకల్లు పట్టణానికి చెందిన రైతు నాగరాజు సత్యనారాయణ పేట శ్మశాన వాటిక సమీపంలో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని అందులో మూడు ఎకరాల్లో వరి, మరో రెండు ఎకరాల్లో చెరకు సాగు చేశాడు. శుక్రవారం చెరకు పంటకు నిప్పంటుకుని కాలిపోయింది. రూ.రెండు లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.